

కలెక్టర్ అనుదీప్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

శ్రీరాంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

బోరబండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సర్కార్ దవాఖానాలో సమస్యల పాగా' కథనానికి కలెక్టర్ నుంచి స్పందన లభించింది. ఈ కథనంతో ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమస్యలపై ఆరా తీశారు. మెకానిక్ షెడ్‌లో ఉన్న అంబులెన్స్‌కు నిధులు మంజూరు చేశారు. సిబ్బందికి జీతాలు ఇవ్వాలని సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. డీజీపీతో మాట్లాడి పోలీస్ సెక్యూరిటీ కేటాయించేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రికి సీనియర్ గైనకాలజిస్ట్‌ను కేటాయించాలని ఆస్పత్రి సిబ్బంది కోరగా అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలోని విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. శంకర ఫౌండేషన్, ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో రెండు వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, పాఠశాల చైర్మన్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జె.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జిగోపి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కాకతీయహిల్స్, బెంజ్ షోరూం, అమర్ సొసైటీ ఫీడర్ల పరిధిలోని కాకతీయహిల్స్ కమాన్ లైన్, కావూరి హిల్స్ ఫేజ్-1, పార్క్‌లైన్, జూబ్ ఎడ్జ్ హోటల్, డీమార్ట్‌లైన్, డాక్టర్ కాలనీ వెనుక ప్రాంతం, ఆంధ్ర బస్తీ, అమర్ సొసైటీ, కావూరి హిల్స్ ఫేజ్- 2, ఆర్ట్‌గ్యాలరీ లైన్, దుర్గం చెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



అదనపు అంతస్తులను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

- డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా హెచ్చరించారు. బుధవారం ఎర్రగడ్డ అల్‌నూర్ మసీద్ ప్రాంతంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్‌నూర్ మసీదు రోడ్డులో అనుమతి లేకుండా ఐదు అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టారని, కేవలం రెండు అంతస్తుల వరకే అనుమతి ఉందన్నారు. అయితే ఐదు అంతస్తులు నిర్మిస్తుండడంతో గత డిసెంబర్‌లోనే నోటీసులు జారీ చేశామన్నారు. అయినప్పటికీ ఇంటి యజమాని పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడని, దీంతో అదనపు అంతస్తులను కూల్చివేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కూల్చివేతల్లో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ నరేష్, ఇంజనీర్లు స్పందన, మౌనిక పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోల్‌కత్తాకు చెందిన యువతి ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తుంది. ఆమెకు 2023లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సాయిప్రణీత్‌తో పరిచయం ఏర్పడింది. ఇదే సమయంలో యువతి తండ్రికి అనారోగ్యం ఏర్పడటంతో ఆమెతో కలిసి కోల్‌కత్తాకు వెళ్లి సహాయం చేశాడు. ఆ తర్వాత తనను ప్రేమిస్తున్నట్టు చెప్పాడని, అతడి సోదరి వివాహం కాగానే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. గాయత్రిహిల్స్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని వారు తరచూ కలిసేవారు. ఈ క్రమంలో ప్రణీత్ సోదరికి పెళ్లి కుదిరినట్టు తెలుసుకున్న యువతి వారి పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. అయితే అందుకు తాను ఒప్పుకోలేదని, తనను మర్చిపోతే రూ. 20 లక్షలు ఆఫర్ ఇచ్చాడంది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం పార్కింగ్ విషయంలో ఘర్షణ.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్ చేయొద్దన్న వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో నివసించే ఖలీల్ పాషా ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 17న తన ఇంటి ముందు ఇద్దరు వ్యక్తులు వాహనం పార్క్ చేస్తుండగా అడ్డుకున్నాడు. ఈ విషయంలో గొడవ జరగడంతో వారు ఖలీల్ ఇంట్లోకి ప్రవేశించి కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం

మోతినగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలిక అదృశ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కావూరి హిల్స్ సమీపంలో నివసించే అమిత్ పర్వాని కుమార్తె జిగుని(10)కి మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ నెల 15న ఆడుకుంటున్న బాలిక అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

పంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నంకు పాల్పడిన ఘటనలో ఇద్దరు మహిళలకు మూడు సంవత్సరాల జైలు శిక్ష,వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చింది. పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ తెలిపిన వివరాల మేరకు.. 2017లో కానిస్టేబుల్ కిషోర్ పంజాగుట్ట పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో రాజేంద్రనగర్ అక్బర్ కాలనీకి చెందిన పర్వీన్ బేగం, షాహీన్ బేగం అతనిపై హత్యాయత్నంకు పాల్పడ్డారు. కానిస్టేబుల్ కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు వెలువరించారు.



ఎస్పార్టీనగర్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పించిన కార్పొరేటర్ బాబా



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు కాటూరి రమేష్ తదితరులు



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకురాలు జూటూరి కీర్తిరెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు

సాహస వీరుడు 'ఛత్రపతి'

- కొనియాడిన కార్పొరేటర్ ఫసియుద్దీన్
- జయంతి సందర్భంగా శివాజీకి ఘన నివాళి



శివాజీ విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఖైరతాబాద్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పించిన కార్పొరేటర్ విజయారెడ్డి, శివాజీ యూత్ క్లబ్ ప్రతినిధులు

బోరబండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన సాహస వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బుధవారం బోరబండ ఎస్పార్టీ నగర్‌లో నిర్వహించిన శివాజీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఛత్రపతి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మరాఠీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సాయిబాబానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శివాజీ జయంతి కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఏడీ మధు, అధ్యక్షుడు ఎం.రాము పాల్గొని నివాళులర్పించారు.

జెక్ కాలనీలో..

అమీర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని జెక్ కాలనీలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖలీల్ బేగ్, రాజేష్ ముదిరాజ్, శేఖర్, పీయూష్ గుప్తా, ఆకుల రాజు, మధు, జమీర్, సమీఉల్లా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

శివాజీ జయంతి సందర్భంగా అమీర్‌పేట గురుద్వారా నుంచి మున్సిపల్ గ్రౌండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, సుమిత్‌సింగ్, ఉత్తమ్ కుమార్‌రాజ్, జితేందర్ శుక్లా, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వీరోచిత పోరాటంతో ముస్లిం నవాబులను గడగడలాడించి హిందూ సామ్రాజ్య స్థాపన చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. బుధవారం ఖైరతాబాద్ మార్కెట్ చౌరస్తాలోని శివాజీ విగ్రహం వద్ద ఆయన జన్మదిన వేడుకలను శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు విజయారెడ్డి, బొంతు శ్రీదేవి యాదవ్, శివాజీ యూత్ క్లబ్ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్, ఎం.మహేందర్ బాబు తదితరులు శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హైడ్రాను మరింత పటిష్టం చేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు,కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాను మరింత పటిష్టం చేయాలని పలువురు భూ కబ్జాదారుల బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా కబ్జాదారుల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలకు హైడ్రా పరిష్కారం చూపుతోందన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నగరం, శివారు ప్రాంతాలకు చెందిన బాధితులు నాగేశ్వరరావు, సాయికుమార్, చంద్రశేఖర్, తనూజ, శ్రీనాథ్, గాయత్రి, నవీన్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిందని, కబ్జాదారుల బారి నుంచి తమను రక్షిస్తుందని చెప్పారు. కొంత మంది కబ్జాదారులు హైడ్రాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారంచేయిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హైడ్రా ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని చెప్పారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్షపూరిత కేసులు నమోదు చేస్తున్నారని, సీఎం స్పందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు తమకు హైడ్రా చేసిన మేలును, కబ్జాదారులు వేధిస్తున్న వివరాలను పలువురు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దివ్యనగర్, కోహెడ, అమీన్‌పూర్, నాగిరెడ్డి చెరువు, ముత్తంగి, బడంగ్ పేట్ తదితర ప్రాంతాల్లో హైడ్రా వల్ల లబ్ధిపొందిన వారు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు



జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

బేగంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. టీఎస్‌కేసీ నేతృత్వంలో అనుదీప్ ఫౌండేషన్, మాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొన్నాయి. కళాశాలకు చెందిన 347 మంది విద్యార్థినులు మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ త్రిపురం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళా తమ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

బస్తీల్లో పర్యటించిన కార్పొరేటర్ బాబా

బోరబండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ పరిధిలోని బస్తీల్లో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బంజారానగర్, భారత్‌నగర్, రాజీవనగర్‌తో పాటు పలు బస్తీల్లో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. వేసవిలో నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జలమండలి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

26న చాముండేశ్వరి పీఠంలో జాగరణ మహోత్సవం

ఎంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 26న కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ మైదానంలో జాగరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ చాముండేశ్వరి అనుగ్ర పీఠాధిపతి శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 26న నిర్వహించనున్న జాగరణ మహోత్సవం, అహోరాత్ర అభిషేకాల కరపత్రాన్ని జి.వెంకటేశ్వర రాజు, పవన్‌కుమార్ శర్మలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహాశివరాత్రి పర్వదినాన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహా శివుడికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ చాముండేశ్వర మహర్షి, వెంకటేశ్వర రాజు, పవన్ కుమార్ శర్మ తదితరులు

హెడ్ కానిస్టేబుల్‌నని నమ్మించి రూ.2.82 లక్షల మోసం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాను హెడ్ కానిస్టేబుల్‌నని నమ్మించి రూ.2.82 లక్షలు వసూళ్లు చేసిన కేసులో బంజారాహిల్స్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన హరిజన గోవర్ధన్ (35) కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. అగ్నిమాపక శాఖలో 2009 నుంచి 2014 వరకు హోంగార్డుగా పనిచేశాడు. అక్కడ విధులు మానేసిన తర్వాత పాల పంపిణీ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గోవర్ధన్ ఓ రోజు బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనం ఎదురుగా ఉన్న కేఫ్‌లో ఉండగా.. ఆరేటి జ్ఞానసాయి ప్రసాద్ తన స్నేహితులతో కలిసి మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో అతనితో మాట కలిపిన గోవర్ధన్ తాను ఎదురుగా ఉన్న ఐసీసీసీ భవన్‌లో టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నానని నమ్మించారు. తర్వాత ఓ రోజు ఐసీసీసీ భవనం వద్దకు జ్ఞానసాయి పిలిపించగా హోటల్ వ్యాపారానికి సహకరించేందుకు రూ.2,82,725లను అతనికి ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి గోవర్ధన్ స్పందించలేదు. దీంతో జ్ఞానసాయి ప్రసాద్ ఐసీసీసీ భవనం వద్ద వచ్చి విచారించగా, అలాంటి వ్యక్తి ఇక్కడ పనిచేయడం లేదని తెలుసుకున్నాడు. దీంతో బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 17వ తేదీన అరెస్టు చేయగా, న్యాయస్థానం బుధవారం రిమాండ్ విధించింది.

భవనం సీజ్.. పన్ను చెల్లించిన యజమాని

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను కట్టపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు భవనాన్ని సీజ్ చేయడంతో యజమానులు పన్ను చెల్లించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 లోని బగ్గా వైన్స్‌కు చెందిన ఓ హోటల్ యాజమాన్యం 2019 నుంచి ఆస్తి పన్ను చెల్లించడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. రూ.1.028 కోట్ల మేర బకాయి ఉండటంతో బుధవారం అధికారులు దాడులు నిర్వహించి భవనాన్ని సీజ్ చేశారు. పన్ను బకాయి చెల్లిస్తే తెరుస్తామని చెప్పారు. భవన యజమానులతో పాటు, కిరాయిదారులు అధికారులతో చర్చించి ప్రస్తుతానికి రూ.32 లక్షల చెక్కును అందజేశారు. మార్చి 31 లోగా మిగతా మొత్తాన్ని చెల్లించకపోతే ఈసారి భవనాన్ని సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎంసీ ఉప్పలయ్య, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ భార్గవ నారాయణ, విటల్ పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దుచేసి తనకు న్యాయం చేయాలని నల్గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన బాధితురాలు పుష్పలత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ అధికారి పేరు తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించింది. మంత్రులు, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయింది.



ఆశ్రమంలో బియ్యం, పండ్లు, ఆట వస్తువులను అందజేస్తున్న పీవీ రవిశేఖర్ రెడ్డి

అనాథలకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమాల్లో ఉండే చిన్నారులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఎర్రగడ్డ సారధినగర్‌లోని ఆదర్శ ఫౌండేషన్ అనాథాశ్రమంలోని పిల్లలకు సొంత ఖర్చుతో బియ్యం, పండ్లు, దుస్తులు, ఆట వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాథాశ్రమాల్లో ఉండే చిన్నారులు కృంగిపోకుండా చదువు, జీవితాశయంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ఓ ప్రతిభ ఉంటుందని, దానికి పదును పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న కోర్టు టైపిస్టులు, స్టాంప్‌వెండర్లు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి టైపిస్టులు, స్టాంప్‌వెండర్లు కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్నేళ్లుగా సికింద్రాబాద్ కోర్టు ఆవరణ బయట ఫుట్‌పాత్‌పై కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే ట్రాఫిక్‌కు ఇబ్బందవుతుందని పోలీసులు చెబుతూ వస్తున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఇక యథావిధిగా టైపిస్టులు, స్టాంప్‌వెండర్లు తమ కార్యకలాపాలను సాగించవచ్చని తెలిసింది. ఆ మేరకు తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శ్రీగణేష్‌ను కలిసి వారు సన్మానం చేశారు.

చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మారేడుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు ఆరోగ్యం కూడా చాలా అవసరమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. బుధవారం మారేడుపల్లి పద్మశాలి కల్యాణ మండపంలో మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న బాలికలకు ప్రతిభ ఆధారంగా 3,900 మందికి స్కాలర్‌షిప్‌ను ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి ఆయన అందజేశారు. కష్టపడి చదువుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తమకు చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వారిని అభినందించారు. ట్రస్ట్ ఎండీ. అహ్మద్, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి , షోరూమ్ హెడ్స్ సిరాజ్, శారీస్, షిహబ్, మార్వాన్, జాసిల్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



జాబ్ మేళాలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

బేగంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. టీఎస్‌కేసీ నేతృత్వంలో అనుదీప్ ఫౌండేషన్, మాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొన్నాయి. కళాశాలకు చెందిన 347 మంది విద్యార్థినులు మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ త్రిపురం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళా తమ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

రామ్‌లక్ష్మణ్‌కు స్పోర్ట్స్ లీడర్‌షిప్ అవార్డు



అవార్డును అందుకుంటున్న రామ్‌లక్ష్మణ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ లక్ష్మణ్‌కు అంతర్జాతీయ స్పోర్ట్స్ లీడర్ షిప్ అవార్డును ఐఎఫ్‌సీఎస్ఎస్ ప్రదానం చేసింది. గతంలో గురుకులాల స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయన సారథ్యంలో 279 మంది క్రీడాకారులు వివిధ జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. ఈ పతకాల సాధనకు గాను రామ్‌లక్ష్మణ్ కృషిని గుర్తించి వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ఐఎఫ్‌సీఎస్ఎస్ సదస్సులో ఆయనకు ఈ అవార్డును బహూకరించారు. ప్రస్తుతం మహేంద్రహిల్స్ గురుకులంలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌నని నమ్మించి మోసం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తాను హెడ్ కానిస్టేబుల్‌నని నమ్మించి డబ్బులు వసూలు చేసిన కేసులో వ్యక్తిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లాకు చెందిన హరిజన గోవర్దన్ (35) కూకట్‌పల్లిలో ఉంటున్నాడు. 2009-14 వరకు అగ్నిమాపక శాఖలో హోంగార్డుగా పనిచేశాడు. అక్కడ విధులు మానేసిన తర్వాత పాల పంపిణీ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గోవర్దన్ ఓ రోజు బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనం ఎదురుగా ఉన్న కేఫ్‌లో ఉండగా.. ఆరేటి జ్ఞానసాయి ప్రసాద్ తన స్నేహితులతో కలిసి మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో అతనితో మాట కలిపిన గోవర్దన్ తాను ఎదురుగా ఉన్న ఐసీసీసీ భవన్‌లో టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నానని నమ్మించారు. తర్వాత ఓ రోజు ఐసీసీసీ భవనం వద్దకు జ్ఞానసాయి పిలిపించగా హోటల్ వ్యాపారానికి సహకరించేందుకు రూ.2,82,725లను ఇచ్చాడు. ఈ తర్వాత నుంచి గోవర్దన్ ఎలాంటి స్పందన లేదు. దీంతో తొలిసారి కలిసిన ప్రాంతం వద్దకు చేరుకుని అతను చెప్పిన ఆఫీస్‌లో విచారించగా, అలాంటి వ్యక్తి ఇక్కడ పనిచేయడం లేదని చెప్పారు. దీంతో మోసపోయాయని గుర్తించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు 17వ తేదీన అరెస్టు నిందితుడిని అరెస్టు చేశారు. బుధవారం జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

ఒక్క ఐడియాతో ఉద్భవించిందే..

రూపాయి భోజనం

- అనార్తులకు ఆకలి తీరుస్తున్న గుడ్ సమ్మారిటీవ్ ఇండియా
- సేవే లక్ష్యమంటున్న నిర్వాహకుడు జార్జి
- మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు దాతలు తోడ్పాటునందించాలని కోరుతున్న...
- పలువురికి ఆదర్శం

అందరిలా వ్యాపారం చేస్తే ఉపయోగం ఏంటి? .. సేవా దృక్పథంతో పాటు వ్యక్తిగత సంతృప్తి కలగాలనే ఆలోచనే.. రూపాయికే భోజనంకు నాంది పలికింది. వెంటనే దాన్ని ఆచరణలో పెట్టారు. భోజన కేంద్రం ద్వారా అనార్తులు, బాటసారుల ఆకలిదప్పికలు తీరుస్తున్నారు. సేవా భావంతో ముందుకు సాగుతున్నారు. రోజుకొక రకమైన ఆహారాన్ని అందజేస్తున్నారు గుడ్ సమ్మారిటీవ్ ఇండియా ఎన్‌జీవో నిర్వాహకుడు జార్జి. అభాగ్యులు, నిరుపేదలకు కడుపునింపుతున్నారు. ఆయనలా మరికొందరు ముందుకొస్తే సహాయ సహకారాలను అందజేస్తానని చెబుతున్నారు.



భోజనం సెంటర్‌ను నిర్వహిస్తున్న జార్జి

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మనోహర్ టాకీస్ సమీపంలో గుడ్ సమ్మారిటీవ్ ఇండియా ఎన్‌జీవోను ప్రారంభించారు జార్జి. ఆధునిక ప్రపంచంలో పోటీ పడాలంటే మనిషి ఆలోచన కూడా అందుకు తగినట్టు ఉండాల్సిందే అంటారు. లాభాపేక్ష వైపు కాకుండా సామాజిక స్పృహతో సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. పేదలు, బాటసారుల ఆకలిని తీరుస్తున్నారు. రూపాయికే భోజనం కేంద్రం నడుపుతున్నారు. తద్వారా రోజూ 250 మంది వద్ద రూపాయి తీసుకొని కడుపునిండా భోజనం పెడుతున్నారు. పది రోజుల క్రితం ప్రారంభమైన ఈ సెంటర్.. ఎందరో అభాగ్యుల ఆకలిని తీరుస్తోంది. అంతేకాదు పెళ్లి, పుట్టిన రోజు జరుపుకొనేవారు తమ వంతుగా సహకారం అందించాలని కోరుతున్నారు. అలాగే తనలా మరికొందరు దాతలు ముందుకొస్తే తాను చేయగలినంతా సాయం చేస్తానంటున్నారు. దీంతో ఇంకొన్ని భోజన కేంద్రాలు వెలిస్తే మరి కొందరి కడుపునింపొచ్చని అంటున్నారు.

నాణ్యమైన ఆహారం..

రూపాయికి భోజనం ఎలా ఉంటుందో అనే అనుమానం అందరికీ రాక మానదు. కానీ నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని నిర్వాహకులు జార్జి చెప్పారు. ఒక రోజు సాంబర్ రైస్, మరో రోజు టమాట రైస్, ఇంకోరోజు తమిళ పొంగల్, కిచిడి ఇలా వెరైటీగా భోజనం అందజేస్తున్నారు. ఇక్కడ పేదలతోపాటు ఎవరైనా భోజనం చేయొచ్చు.

కీర ఇస్తున్నారు



నేను మున్సిపాలిటీలో పనిచేస్తున్నా. ఇక్కడ రూపాయికే భోజనం పెడుతున్నారని తెలుసుకొని వచ్చాను. మధ్యాహ్నం పెడుతున్న భోజనం నాకు సరిపోతుంది. అన్నం, సాంబారుతోపాటుకీర కూడా ఇస్తున్నారు. -పాప్నారప్ప

వినూత్నంగా ఉండాలనే..



నేను గుడ్ సమ్మారిటీవ్ ఇండియా ఎన్‌జీవో ద్వారా పేదలకు సహాయం అందిస్తున్నాను. ఒకవేళ ఎవరైన ఒకరు అందరికీ నచ్చేటట్లు చేస్తే దాన్ని ఇతరులు అనుకరిస్తుంటారు. నా వరకు కొంచెం వినూత్నంగా చేయాలని రూపాయికే భోజనం ప్రారంభించాను. నా శాయశక్తుల యత్నించి పలువురు ఆకలి తీరుస్తున్నాను.

\- జార్జి, నిర్వాహకుడు

అదే బయట తింటే రూ.50లు



నేను జ్యూస్ సెంటర్‌లకు చెరుకు సరఫరా చేస్తుంటాను. ఇక్కడ అన్నం బాగుంది. బయట హోటల్‌లో తినాలంటే కనీసం రూ. 50 ఖర్చు అవుతుంది. ఇక్కడ ఒక్క రూపాయికే అన్నం పెడుతున్నారు. మంచిగా ఉంది. ఆకలి తీరుతుంది

-పరశురాం

సాయన్న చిరస్మరణీయుడు

మారేడుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం దివంగత నేత జి.సాయన్న చేసిన సేవలు చిరస్మరణీయమని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. బుధవారం మారేడుపల్లి చౌరస్తా పార్క్ వద్ద నిర్వహించిన ఆయన వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పనస సంతోష్, యుగంధర్, చంద్ర, శ్యామ్, కుమార్, మల్లేష్, సాయి, ఇస్మాయిల్, వెంకట్, లక్ష్మీ, మనిషా, గోపాల్, రాజేందర్, రాములు, అశోక్, మహష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి: నివాళులర్పిస్తున్న నాయకులు తదితరులు

తిరుమలగిరి: కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్, ప్యారసాని భాగ్యశ్రీ ఆధ్వర్యంలో బుధవారం తిరుమలగిరి లాల్‌బజార్‌లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు అనిత ప్రభాకర్, నళినీ కిరణ్, లోకేనాథ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్యామన్న యువసేన నాయకులు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోర్టు చలానా కట్టేందుకు వెళ్లి..

- కింద పడి న్యాయవాది మృతి
- మారేడుపల్లి పీఎస్ పరిధిలో ఘటన



వెంకటరమణ మృతదేహం

అడ్డగుట్ట / మారేడుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోర్టు చలానా కట్టేందుకు వెళ్లిన ఓ న్యాయవాది ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. ఈ ఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ కు చెందిన వెంకటరమణ (57) సికింద్రాబాద్ సివిల్ కోర్టులో సీనియర్ న్యాయవాది. బుధవారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా కోర్టు చలానా కట్టేందుకు మారేడుపల్లి ఇండియన్ బ్యాంకుకు ఆయన చేరుకున్నాడు. కిటికీకి ఉన్న బ్యాంక్ చలానా (ఓచర్) తీస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బ్యాంకు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌తో పాటు కానిస్టేబుళ్లు ఇక్కడికి చేరుకున్నారు. వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. త్వరితగతిన సీపీఆర్ చేసినా ప్రయోజనం చేకూరలేదని తెలిపారు. ఆమేరకు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బ్యాంకుకు చేరుకున్న కుమార్తె తండ్రి విగతజీవిగా పడి ఉండటం చూసి కన్నీరుమున్నీరైంది. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మంచి స్నేహితుడిని కోల్పోయాం : న్యాయవాదులు

సీనియర్ న్యాయవాది వెంకటరమణ లాంటి మంచి స్నేహితుడిని కోల్పోయామని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. వసంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. ఈ విషయాన్ని బంధువులు, స్నేహితులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. కాగా, బ్యాంకు వద్దకు భారీగా న్యాయవాదులు చేరుకున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణం చేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ బీ క్యాబిన్ వద్ద మంగళవారం రాత్రి ఓ వ్యక్తి చనిపోయాడని రైల్వే పోలీసులు సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో మృతుడికి సంబంధించిన నోట్ బుక్ దొరకడంతో ఫోన్‌నెంబర్ల ఆధారంగా పాలడుగుల సురేష్, హైదరాబాద్ అంబేద్కర్‌నగర్ అని అందులో రాసి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. వాటి ఆధారంగా కుటుంబ సభ్యులను బుధవారం గాంధీ ఆస్పత్రి మార్చురీకి పిలిపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

పలు రైళ్లు రద్దు

- భాగ్యనగర్, దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌ల సహా మరో రెండు..
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



రైల్వేస్టేషన్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భాగ్యనగర్ (సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్), దానాపూర్ (సికింద్రాబాద్ నుంచి బిహార్) ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు మరో రెండు రైళ్లు రద్దయ్యాయి. అయితే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు టికెట్ రద్దు చేసుకునేందుకు ఆశాఖ అధికారులు అవకాశం కల్పించారు. కాని రిజర్వేషన్ కౌంటర్ ఎక్కడ ఉందో తెలియక ప్రయాణికులు సికింద్రాబాద్ కేంద్రియ రిజర్వేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ కౌంటర్‌లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి స్పందిస్తూ, రైళ్లు రద్దు చేశామని ఆ విషయాన్ని అనౌన్స్‌మెంట్ చేశామన్నారు. అప్పై రిజర్వేషన్ టికెట్ల రద్దుకు ప్రత్యేక కౌంటర్ సైతం ఏర్పాటు చేశామన్నారు. అయితే కొందరే స్పందించారని తెలిపారు. ఈ రైళ్ల రద్దుకు గల కారణాలు ఏమిటి? అనే వివరాలు తమకు తెలియదని ప్రయాణికులు చెప్పారు.

ఘనంగా ఎల్లమ్మ ‘కల్లు గుడాలు’



గుడాలలో శ్యామ్‌కుమార్, గజ్జెల నాగేష్ తదితరులు

రేణుకా ఎల్లమ్మ కల్లు గుడాల కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. చిన్నకమేలలో ఉన్న అమ్మవారి దేవాలయంలో కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే శ్రీగణేష్, బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్ కుమార్, ప్యారసాని భాగ్యశ్రీలు అమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిరుమలగిరి ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

రోడ్లను రోజూ శుభ్రం చేస్తున్నారా?



ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రోజూ రోడ్లను ఊడుస్తున్నారా? ఇంటింటికి ఆటోలు వచ్చి చెత్తను తీసుకువెళ్తున్నాయా? అని కార్పొరేటర్ కంది శైలజ స్థానికులను అడిగారు. బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారిస్తానని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈఈ వెంకటేశ్, సూపర్‌వైజర్ దశరథ్, నాయకులు సుజాత, మానస, సులోచన, సుమతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవం

మారేడుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహేంద్రహిల్స్ సాయిబాబా దేవాలయంలో ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మూల నక్షత్ర మేష లగ్న సుముహూర్తమున ఆదివారం ఉదయం 10.36 నిమిషాలకు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ గావిస్తారు. ఆ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ మాజీ ఛైర్మన్, ఆలయ ట్రస్ట్ ఫౌండర్ కొత్త సంజీవరెడ్డి బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని చెప్పారు. ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిదులు సైతం పాల్గొంటారని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో నిందితుడు, 4 కేజీల సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఉన్న వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి నాలుగు కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ , సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా ప్రాంతానికి చెందిన లంబోదర్ జేనా ఈనెల 17న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రూ.98 వేల గంజాయితో దిగి వెయిటింగ్ హాలులో కూర్చున్నాడు. కాగా, స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించగా పట్టుబడ్డాడు. ఆ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



తిరుమలగిరి: ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



అడ్డగుట్ట: తుకారాంగేట్‌లో..



బౌద్ధనగర్: కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం

మరాఠా యోధుడు శివాజీ మహారాజ్ సిద్ధాంతాలను, ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటాలకు, విగ్రహాల వద్ద పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, సామాజిక, సేవా సంఘాల నాయకులు నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు.



బోయిన్‌పల్లి: వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద...



రెజిమెంటల్‌బజార్: ర్యాలీలో మరాఠా సంఘం నాయకులు, స్థానికులు తదితరులు